# గోరంత దీపం

-గన్నవరపు నరసింహమూర్తి

ఆ రోజు ఉదయం లాయర్ కరుణాకరం తన ఆఫీస్ రూమ్‌లో ఉండగా ఓ పాతికేళ్ల వ్యక్తి లోనికొచ్చాడు. అప్పటికింకా క్లయింట్స్ ఎవరూ రాకపోవడంతో కరుణాకరం ఆ రోజు ఏయే కేసులకు హాజరవ్వాలో వాటి ఫైల్స్‌ని పరిశీలిస్తున్నాడు.

అతను వస్తూనే కరుణాకరానికి నమస్కారం పెట్టి "సార్! నా పేరు కృష్ణమోహన్. మీతో పనుండి వచ్చాను" అన్నాడు.

కరుణాకరం ప్రతి నమస్కారం చేసి కూర్చోమన్నాడు. అతను కూర్చున్న తరువాత విషయం చెప్పమన్నట్లుగా చూసాడు. అతను చెప్పడం మొదలు పెట్టాడు.

"నేను ఇక్కడ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను" చెబుతున్న అతను కరుణాకరం ముఖంలో అసహనాన్ని గమనించి "అసలు విషయానికి వస్తున్నాను. ఎందుకో పెళ్లయిన దగ్గర్నుంచీ మా ఇద్దరికీ పడడం లేదు. ఆమె ఆలోచనలు, ఆశయాలు నాకు వ్యతిరేకం. నా అభిరుచులు, అభిప్రాయాలు ఆమెకు రుచించవు. ఆమెతో వివాహబంధాన్ని కొనసాగించాలని విశ్వ ప్రయత్నం చేస్తూ వచ్చాను. కానీ అది సాధ్యంకాలేదు. అందుకే చివరకు ఇద్దరం చట్టపరంగా విడిపోదామన్న నిర్ణయానికొచ్చాము. విడాకులు తీసుకుందామనుకుంటున్నాం. అందుకే మీ దగ్గరకొచ్చాను."

కరుణాకరం అతను చెబుతుంటే మౌనంగా వింటున్నాడు. అతను తిరిగి చెప్పడం కొనసాగించాడు.

"ఈ ఊళ్లో మీరు ప్రముఖ లాయర్ అనీ, అందులోనూ మీరు విడాకుల కేసు వాదిస్తే ఇక తిరుగుండదనీ మా స్నేహితుడు చెబితే మీ దగ్గర కొచ్చాను. మీరు నా కేసును ఎలాగైనా టేకప్ చేసి మాకు త్వరగా విడాకులు వచ్చేట్లు చేయండి" అంటూ తను తెచ్చిన కాగితాలు ఆయనకిచ్చాడు. వాటిలో అన్ని వివరాలు, కొన్ని ఫోటోలున్నాయి.

ఆ కాగితాలను పరిశీలించిన కరుణాకరం వాటిని ప్రక్కన పెడుతూ "ఇవన్నీ సరే. మీరు మీ భార్యతో విడాకులు తీసుకోవడానికి మీరు చెప్పిన కారణాలు సరిపోవు. ఏదైనా బలమైన కారణముండాలి. లేకపోతే విడాకులు మంజూరు కష్టమే అవుతుంది. అందుకని మీరు ఏదీ దాచకుండా నిజాలు నాకు చెప్పాలి. అప్పుడే మీ కేసు వాదించాలా వద్దా అన్నది నేను నిర్ణయించుకుంటాను" అన్నాడు కరుణాకరం.

కృష్ణమోహన్ అతని మాటలు విన్న తరువాత అయోమయంలో పడ్డాడు.

ఏదో టూకీగా చెబితే చాలనీ, మిగతాదంతా లాయరే చూసుకుంటాడనీ అతని స్నేహితుడు చెబితే వచ్చాడు.

కానీ ఇతను అన్ని వివరాలు కావాలంటున్నాడు. కాబట్టి మొత్తం అంతా చెప్పాలనుకున్నాడు.

"ఇందులో దాపరికం ఏమీలేదు సార్. మాది పెద్దలు కుదిర్చిన సంబంధం. ఇద్దరం ఇష్టపడే పెళ్లి చేసుకున్నాం. కాకపోతే పెళ్లికి ముందు ఆమె ఒక కండిషన్ పెట్టింది. తను ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ దేశాన్ని వదిలి ఇతర దేశాలకు రానని, అందుకని పెళ్లయిన తరువాత స్టేట్స్‌కి వెళతానంటే తాను ఒప్పుకోననీ, అందుకు ఇష్టమైతేనే ఈ పెళ్లికి తాను ఒప్పుకుంటాననీ కరాఖండీగా చెప్పింది. అప్పట్లో నాకూ ఆ ఆలోచన లేకపోవడంవల్ల ఆమె పెట్టిన షరతుకు ఒప్పుకోవడంతో మా వివాహం సజావుగా జరిగిపోయింది" కరుణాకరం అతను చెబుతుంటే దీక్షగా వింటున్నాడు.

"కానీ పెళ్లయిన సంవత్సరం తరువాత మా కుటుంబానికి కొన్ని ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. చాలా అప్పులు చేయవలసి వచ్చింది. కోర్టు తగాదాలో మేము ఓడిపోయాము. చాలా ఆస్తులు కోల్పోయాం. ఇంతలో స్టేట్స్‌లో నాకు పెద్ద ఆఫర్ వచ్చింది. నెలకు రెండులక్షలకు పైగా జీతం. ఈ అప్పులు తీరాలంటే నేను స్టేట్స్‌కు వెళ్లి తీరాలి. కానీ నేను వెళ్లడానికి ఆమె ఒప్పుకోవడం లేదు. ఇద్దరం ఇక్కడే కష్టపడి అప్పులు తీరుద్దాం అంటోంది. కానీ ఇక్కడి జీతాలతో అది జరిగే పని కాదు. సంవత్సరం నుంచి మామధ్య ఈ వివాదం నడుస్తోంది. అది చివరకు విడాకులవరకూ వచ్చింది."

"మిస్టర్ మోహన్! ఆమె ఎట్టి పరిస్థితుల్లోనూ తను ఈ దేశం వదిలి రానని, పెళ్లికి ముందే మీకు చెప్పింది కాబట్టి ఆమెను ఈ విషయంలో తప్పు పట్టలేం. అందుకే ఆమె నిర్ణయాన్ని మీరు గౌరవించవలసిన అవసరం ఉంది" మధ్యలో కల్పించుకుని అన్నాడు కరుణాకరం.

"మీరు చెప్పింది నిజమే. కానీ జీవితంలో అన్నీ మనం అనుకున్నట్లు జరగవు కదా. పరిస్థితులకు అనుగుణంగా మనం నిర్ణయాలు మార్చుకోవాల్సి వుంటుంది."

"కానీ విడాకుల ప్రక్రియ అన్నది భార్యాభర్తల జీవితాల్లో ఆఖరిది కావాలి. అన్ని మార్గాలు మూసుకుపోతేనే దానికి సిద్ధపడాలి. విడాకుల తరువాత వాళ్లకి సంఘంలో గౌరవం ఉండదు. అందులో ఆడదానికైతే ఇంకా కష్టం. ఇక పిల్లలుంటే వాళ్ల జీవితాలు మరీ నరకం అవుతాయి. ఒక న్యాయవాదిగా నా దగ్గరకొచ్చే క్లయింట్స్ దాని మంచి చెడ్డలు చెప్పడం నా కనీస బాధ్యత. ఎందుకంటే చాలామంది ఆవేశంతో తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటారు. అందుకే ఇంత వివరంగా చెప్పడం... ఇక తప్పదంటారా.. అప్పుడెలాగూ కేసును కోర్టులో ఫైలు చేయకతప్పదు" అన్నాడు కరుణాకరం.

"ఇంక ఆలోచించడానికేమీ లేదు సార్. సంవత్సరం నుంచి మామధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. అవి ఇప్పుడు పతాకస్థాయికి చేరుకున్నాయి. అన్ని మార్గాలు మీరన్నట్లు మూసుకుపోయాయి కాబట్టే మీ దగ్గర విడాకులకోసం

వచ్చాను. మీరు ఏ సంకోచం లేకుండా ఈ కేసును కోర్టులో దాఖలు చేయండి. వివరాలన్నీ ఆ కవరులో వున్నాయి. మీ ఫీజెంతో చెబితే అడ్వాన్స్ ఇస్తాను. కానీ ఆ విడాకులేవో త్వరగా వచ్చేట్లు చూడండి'' కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు కృష్ణమోహన్.

"అది సరే. ఈ కేసును స్వీకరించే ముందు మీ భార్యతో కూడా నేను మాట్లాడాలి. మీకు అభ్యంతరం లేకపోతే ఆమె పని చేసే ఆఫీసు అడ్రస్ ఇవ్వండి''

కరుణాకరం అలా అనగానే కృష్ణమోహన్ ముఖంలో కళ తప్పింది.


అక్కడ సూదిమొన పడితే వినిపించేటంతటి నిశ్శబ్దం.

కాసేపటికి తేరుకుని మెల్లగా అన్నాడు "ఆమెతో మాట్లాడడం అవసరం అంటారా?''

"నేను మీ కేసును వాదించాలంటే ఇవన్నీ అవసరమే" కరుణాకరం నిర్మొహమాటంగా చెప్పడంతో కృష్ణమోహన్ ఆమె పని చేసే ఆఫీసు అడ్రస్ ఇచ్చి వెళ్లిపోయాడు.

★★★

ఆ మర్నాడే కరుణాకరం సువర్చలని ఆమె ఆఫీసులో కలుసుకున్నాడు.



తను వచ్చిన కారణం చెప్పాడు.

ఆమె కేంటిన్‌లో మాట్లాడుకుందామని చెప్పడంతో ఇద్దరూ క్యాంటిన్‌లో కూర్చుని మాట్లాడుకోసాగారు.

మధ్యాహ్నం కావడంతో క్యాంటిన్ రద్దీగా ఉంది.

"నిన్ననే మీ భర్త కృష్ణమోహన్ వచ్చి తనకు మీతో విడాకులు ఇప్పించమని కోరాడు. ఎందుకు కావాలో ఆ కారణాలు కూడా చెప్పాడు. నేను మీతో మాట్లాడిన తరువాతగానీ ఈ కేసు స్వీకరించనని చెప్పాను. ఇప్పుడు చెప్పండి. నాణేనికి రెండోవైపున మీ వాదన కూడా వినాలని నా కోరిక."

ఇంతలో వెయిటర్ కాఫీలు తెచ్చాడు. ఆమె అతనికి ఓ కప్పు అందించి తను ఇంకో కప్పు కాఫీ తాగుతూ అంది.

"బహుశా అతను నిజమే చెప్పాడనుకుంటాను. మా ఇద్దరికీ సంవత్సరం నుంచి అతడు అమెరికా వెళ్లాలన్న విషయమై గొడవ జరుగుతోంది. ఈ విషయంలో ఇద్దరం ఏకాభిప్రాయానికి రాలేకపోయాం. అందుకే ఈ విడాకులు."

"నిజమే! నాకెందుకో మీ ఇద్దరూ విడిపోవడానికి చెబుతున్న కారణం సహేతుకంగా అనిపించడంలేదు. మీరు చదువుకున్నవారు కాబట్టి చెబుతున్నాను. ఎంతో లోతైన కారణాలుంటేతప్ప భార్యాభర్తలు విడిపోకూడదు. విడిపోతే ఇద్దరి జీవితాల్లోనూ అశాంతి. ఇక పిల్లలుంటే..." అంటూ ఒక్క క్షణం ఆగాడు.

"మాకొక బాబు"

"మీరు ఈ విషయాన్ని చాలా తేలిగ్గా తీసుకున్నారనుకుంటాను. విడాకులు తీసుకున్న తరువాత మీరేం చేద్దామనుకుంటున్నారు? ఈ బాబుతో ఒంటరిగా ఉండగలరా? లేదా? మళ్లీ పెళ్లి చేసుకుంటే మీ బాబు జీవితం ఏం కావాలి? ఆ వచ్చినవాడు మీ బాబును ఆదరిస్తాడా? ఇవన్నీ మీరు ఆలోచించారా? విడాకులు తీసుకున్న స్త్రీని ఈ సమాజం చాలా చిన్న చూపు చూస్తుంది సువర్చలగారూ!" అతను చెబుతూ క్షణం ఆగాడు.

ఆమె తల దించుకుని మౌనంగా వింటోంది. కాసేపటికి "ఇప్పుడు నన్నేం చేయమంటారు?" అంది.

"మేడమ్! మీ జీవితం మీ ఇష్టం. కానీ పిల్లవాడి భవిష్యత్తును పాడు చేసే హక్కు మీకు లేదు. అయినా అతను కొన్నాళ్లు అమెరికా వెళ్తే మీకేంటి కష్టం. ఏవో ఆర్థిక ఇబ్బందులు అంటున్నాడుకదా. ఓ రెండు మూడేళ్లు ఓపిక పడితే సమస్యలు వాటంతట అవే తీరిపోతాయి. ఈ కోణంలోంచి ఆలోచిస్తే ఓ పరిష్కారం దొరుకుతుంది. మీరిద్దరూ మరోసారి మనసు విప్పి మాట్లాడుకోండి. నేను కూడా మీ భర్తతో మాట్లాడతాను. అప్పటికీ తప్పకపోతే అప్పుడు ఆలోచిద్దాం. కానీ నాకెందుకో ఆ అవసరం రాదనే అనిపిస్తోంది. ఆలోచించి మీ నిర్ణయాన్ని చెప్పండి" అంటూ కరుణాకరం ఆమె దగ్గర సెలవు తీసుకున్నాడు.

★★★

వారంరోజుల తరువాత కరుణాకరం ఆఫీసులో ఉండగా కృష్ణమోహన్, సువర్చల కలసి వచ్చారు.

వాళ్లను చూసి కరుణాకరం ఒకింత ఆశ్చర్యానికి గురయ్యాడు. ఇద్దరినీ కూర్చోమని సైగ చేసాడు.

కొంతసేపటి తరువాత సువర్చల అంది.

"లాయరుగారూ! ఆ రోజు మీరు మా ఆఫీసుకొచ్చి మాట్లాడిన తరువాత నాలో సంఘర్షణ మొదలైంది. రెండురోజులపాటు తీవ్రంగా ఆలోచించాను. అప్పుడు మీరు చెప్పిన విషయాలు సబబే అనిపించాయి. జీవితంలో కొద్దిగా రాజీపడితే తప్పులేదనిపించింది. పంతాలు పట్టింపులకు పోకూడదనిపించింది. అందుకే అతను అమెరికా వెళతానంటే నాకేం అభ్యంతరం లేదని చెప్పాను."

"అవును కరుణాకరంగారూ! ఆమె ఎప్పుడైతే నేను అమెరికా వెళ్లడానికి అంగీకరించిందో నా ఆలోచనల్లోకూడా మార్పు వచ్చింది. మా వివాహ బంధం నిలబడాలనీ ఆమె ఓ మెట్టుదిగినప్పుడు నేనెందుకు దిగకూడదు అనిపించింది. అందుకే నేను కూడా అమెరికా వెళ్లాలన్న ఆలోచన ఇప్పుడు మానుకున్నాను. నిజంగా మీరు చెప్పినట్లు మేము అవగాహన లేక ఆవేశంతో తీసుకున్నది ఆ విడాకుల నిర్ణయం. సరైన సమయంలో మంచి సలహా ఇచ్చి మా జీవితాలను కాపాడారు. అందుకు మీకు ఏ విధంగా కృతజ్ఞతలు చెప్పాలో తెలియడంలేదు" అన్నాడు కృష్ణమోహన్.

"నాకు లాయర్‌గా ముప్పై సంవత్సరాల అనుభవం ఉంది. ముఖ్యంగా విడాకుల కోసం చాలామంది దంపతులు ఆవేశంతో నిర్ణయం తీసుకుంటారు. అందుకే వాళ్లకు కౌన్సిలింగ్ తప్పనిసరి. మీరు కోర్టుకు వెళ్లినా జడ్జిగారు అదే సలహా ఇస్తారు. అందుకు కొంత వ్యవధి కూడా ఇస్తారు. ఇందులో నేను చేసిన సహాయం ఏదీలేదు" అన్నాడు కరుణాకరం.

తన ప్రయత్నం ఫలించి ఆ జంట తిరిగి ఒకటవ్వడం అతనికి ఆనందం కలి

## 'నగ' రాజ

వజ్ర వైఢూర్యాలను, రత్నాలను నాగుపాములు కాపలా కాస్తాయని కథల్లో చదివాం. లండన్‌లోని హారోడ్స్ స్టోర్స్‌లో వజ్రం, కెంపు, నీలం



లాంటి రత్నాలని పొదిగిన పాదరక్షలకు ఒక ఈజిప్ట్ దేశపు విషనాగును కాపలా పెట్టారుట. దాని కళ్లు కెంపుల్లా మెరుస్తున్నాయిట. ఈ పాదరక్షల ఖరీదు అక్షరాలా 50 లక్షల రూపాయలు.

-విమలారామం



గించింది.

అతను భార్యను పిలిచి వారికి పరిచయంచేసి కాఫీలు తెమ్మన్నాడు.

"సార్! మీకు లాయర్‌గా మంచి పేరుంది. మీరు తీసుకున్న ఏ కేసులోనూ మీకు విజయమేతప్ప ఓటమి ఎరుగరు. అటువంటి మీరు ఈ కేసును స్వీకరించి వాదించకుండా మమ్మల్ని కలపాలని ఎందుకు ప్రయత్నించారు?" కృష్ణమోహన్ ప్రశ్నించాడు.

"అవును సార్! నన్ను కలిసి నాతో మాట్లాడి నన్ను ఒప్పించారు. ఆ గొప్పతనం మీదే. కానీ ఆ అవసరం మీకు లేదు. ఎందుకంత కష్టపడి మా జీవితాల్లో వెలుగు నింపాలని ప్రయత్నించారు. నిజంగా మీలాంటి వారుండే ఇక ఇటువంటి విడాకుల కేసులు కోర్టులదాకా రావు. నిజంగానే మావారు అన్నట్లు మమ్మల్ని కలపాలని ఎందుకు ప్రయత్నంచారు?" సువర్చల కూడా కరుణాకరాన్ని ప్రశ్నించింది.

కాసేపు అక్కడ నిశ్శబ్దం. తరువాత కరుణాకరం చెప్పడం మొదలుపెట్టాడు.

"నేను లాయర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించిన కొత్తల్లో యాధృచ్ఛికంగా చాలా వరకు విడాకుల కేసులు నావద్దకు వచ్చాయి. లాయర్‌గా మంచి పేరు తెచ్చుకోవాలని కష్టపడి వాదించి క్లయింట్లకు న్యాయం చేసాను. కొన్నాళ్లకు నాకు విడాకుల లాయర్‌గా పేరొచ్చింది. అందరూ నన్ను అలా పిలుస్తుంటే నాలో తెలియని గిల్టీ ఫీలింగ్ కలుగుతుండేది. నేను వృత్తి ధర్మంలో పడి ఎవరికైనా అన్యాయం చేస్తున్నానా అన్న భావన నన్ను కలచి వేస్తుండేది. సాఫీగా సాగిపోతున్న నా జీవితంలో ఒక పెద్ద ఎదురుదెబ్బ మా అమ్మాయి వివాహం ద్వారా తగిలింది. ఎంతో ఆడంబరంగా రంగరంగ వైభవంగా ఎన్నో కానుకలిచ్చి జరిపించిన ఆమె వివాహం అత్తమామల ధనదాహం, భర్త చెడు వ్యసనాలవల్ల విడాకుల దాకా వెళ్లింది.

ఎంతోమందికి విడాకులు ఇప్పించిన నాకు నా కూతురు విడాకుల కేసు ఓ సవాలుగా మారింది. ఆమెతో విడాకులు కావాలని అల్లుడు నోటీసు పంపించినప్పుడు వాళ్లు విడిపోకుండా కలపాలని ఎంతో ప్రయత్నించాను. అతని కాళ్లు కూడా పట్టుకుని బ్రతిమిలాడాను. కానీ ఎన్నో విడాకుల కేసుల్లో అవలీలగా విజయం సాధించిన నేను నా కూతురి కేసులో మాత్రం ఘోరంగా ఓడిపోయాను. ఎంతోమందిని విడదీసిన పాపమే నా కూతురి జీవితాన్ని బలి తీసుకుందని నాలో అంతర్మథనం మొదలైంది.

విడాకుల కేసులు స్వీకరించడానికి నా జీవితం ఒక కారణం అయితే నన్ను పూర్తిగా మార్చిన అసలు సంఘటన ఇంకొకటుంది" అంటూ సొరుగులోంచి ఒక ఫైలు తీసి అందులోని ఒక ఉత్తరాన్ని సువర్చలకిచ్చాడు చదవమని. అందులో ఇలా ఉంది.

"లాయర్ అంకుల్‌కి!

ఈ ఉత్తరం వ్రాస్తున్న నా పేరు సీత. ఒక అనాథ ఆశ్రమం నుంచి ఈ ఉత్తరం రాస్తున్నాను. నేను ఎనిమిదవ తరగతి చదువుతున్నాను. నాకు మా వార్డెన్ ద్వారా ఈమధ్యనే తెలిసింది మా అమ్మానాన్నలు నా చిన్నప్పుడే గొడవపడి విడాకులు తీసుకున్నారని. ఆ తరువాత మా తాతయ్య నన్ను ఈ అనాథాశ్రమానికి అప్పజెప్పి మా అమ్మకి వేరే పెళ్లి చేసి అమెరికా పంపించివేసారుట. మా నాన్న కూడా తరువాత ఇంకో పెళ్లి చేసుకున్నారుట. మా అమ్మానాన్నలు ఎవరో కూడా నాకు తెలీదు.

స్కూల్లో జరిగే ప్రతి కార్యక్రమంలో నా స్నేహితుల తల్లిదండ్రులను చూసినప్పుల్లా నాకు ఏడుపు వస్తుంది. అసలు విషయం అంకుల్... ఇంతకీ మా తల్లిదండ్రులకు విడాకులు రావడానికి మీరే కారణమట. ఆ కేసును మీరే వాదించారుట. అంకుల్! మీవల్లే ఎంతోమంది నాలాంటి పిల్లలు అనాథలవుతున్నారు. తల్లీదండ్రీ ఎవరో తెలియక జీవితాంతం బాధపడుతున్నారు. కాబట్టి నాదో విన్నపం అంకుల్... ఇంకే తల్లిదండ్రులను విడదీసి నాలాంటి అనాథల్ని చేయవద్దని వేడుకుంటున్నాను.

ఇట్లు

సీత (ఓ అనాథ)

సువర్చల ఉత్తరాన్ని చదివి కృష్ణమోహన్‌కిచ్చింది. కాసేపటికి కరుణాకరం అన్నాడు "ఆ చిన్న పిల్ల రాసిన ఆ ఉత్తరం నా గుండెను కదిలించింది. నా జీవిత గమ్యాన్నే మార్చివేసింది. అప్పట్నించీ నేను ఏ విడాకుల కేసూ స్వీకరించడంలేదు. వచ్చినవాళ్లకు నా శాయశక్తులా ప్రయత్నించి వాళ్లు విడిపోకుండా చేస్తున్నాను. వాళ్ల జీవితాల్లోంచి చీకటిని పారద్రోలడానికి గోరంత దీపాన్ని వెలిగించే ప్రయత్నం చేస్తున్నాను" అన్నాడు కరుణాకరం.

"మీరు చేస్తున్న సేవ నిరుపమానం. అవగాహనా రాహిత్యంతో వచ్చే మాలాంటి దంపతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నందుకు మేము సదా కృతజ్ఞులం" అంటూ ఆ దంపతులు అతని దగ్గర్నుంచి శలవు తీసుకున్నారు.

★



# విఫలమైన ప్రేమకథ?

సల్మాన్ ఖాన్‌తో కత్రినా 'దోస్తీ'కి ఇక తెర పడినట్టే అంటున్నారు సినీ జనాలు. సల్మాన్ తీరుతో వేగలేక ఇదివరలో సంగీతా బిజిలానీ, ఐశ్వర్యారాయ్ లాంటి తారలు అతనికి గుడ్‌బై చెప్పేసిన సంగతి జనాలకి బాగా తెలుసు. ఇటీవల కాలంలో సల్మాన్‌కి చేరువైన కత్రినా క్రమంగా అతని తీరుకి విసిగిపోయి ఇక దూరంగా వుండడం బెటరని భావించిందని ఆమె సన్నిహితుల ఉవాచ. విదేశాలకు షూటింగ్‌లకు వెళ్లిపోయినా, కొత్త సినిమాలు ఒప్పుకునేప్పుడూ సల్మాన్ ఆమెని ప్రశ్నిస్తుండడం కత్రినాకి కాస్తంత చిరాకు కలిగిందిట. సో ... మరో లవ్ స్టోరీ ట్రాజెడీగా ముగియబోతోందన్నమాట.

